సాక్షి ఖమ్మం

శుక్రవారం । 28 । జూలై । 2023



రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి

సింగరేణి గనుల్లో తగిన రక్షణ చర్యలు పాటిస్తూనే బొగ్గు ఉత్పత్తి చేయాలని మైన్స్ సేఫ్టీ అధికారులు సూచించారు. 8లో



పెట్రోల్‌లో నీళ్లు.. బంక్ సీజ్

ఎర్రుపాలెంలోని ఓ బంక్‌లో పెట్రోల్‌లో నీళ్లు వచ్చాయనే ఫిర్యాదుతో అధికారులు తనిఖీ చేసి బంక్‌ను సీజ్ చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
28° / 25°

వాతావరణం

శుక్రవారం జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసే సూచనలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

కంట్రోల్ రూమ్‌కు 25 ఫోన్లు



ఫోన్‌లో సమాధానాలు ఇస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో భారీ వర్షాల నేపథ్యాన కలెక్టరేట్(ఐడీఓసీ)లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌కు పలువురు ఫోన్ చేస్తున్నారు. ఈమేరకు గురువారం 25 మంది ఫోన్ చేయగా, ఎక్కువమంది మున్నేరు వద్ద వరద ఉధృతిని తెలియచేయడంతో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజల పునరావాస కేంద్రాల సమాచారాన్ని తెలుసుకున్నారు.

9కేంద్రాలు.. 937 కుటుంబాలు

ఖమ్మం సహకారనగర్: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని పలు ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యాయి. ఆయా ప్రాంతాల ప్రజలకు ఆశ్రయం కల్పించేందుకు తొమ్మిది పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశారు. జిల్లాలోని 13 కాలనీల నుంచి 937 కుటుంబాలకు చెందిన 2,485మందిని పునరావాస కేంద్రాలకు చేర్చారు. మొత్తంగా 852 ఇళ్లను వరద ముంచెత్తిందని నిర్ధారించారు. వరదలతో జిల్లాలో ఇప్పటి వరకు రెండు ఇళ్లు పూర్తిగా దెబ్బతినగా... మూడు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అయితే, ఎక్కడా ప్రాణనష్టం జరకపోగా, జంతువులు, రహదారులు, పంటలు, బ్రిడ్జిలు, కల్వర్టులకు నష్టం ఎదురుకాలేదని అధికారులు వెల్లడించారు.

ఆర్టీసీకి రూ.35లక్షల నష్టం

ఖమ్మం మామిళ్లగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ఆర్టీసీకి తీవ్ర నష్టం ఎదురైంది. పలుచోట్ల రహదారులపైకి వరద చేరడంతో రాకపోకలు నిలిపివేయగా ఆర్టీసీ అధికారులు గురువారం బస్సు సర్వీసులు రద్దుచేశారు. దీంతో ప్రతిరోజు రావాల్సిన రూ.95లక్షల ఆదాయానికి గాను రూ.60 లక్షలే రాగా, రూ.35 లక్షల నష్టం ఎదురైంది. ఖమ్మం రీజియన్‌లోని ఆరు డిపోల పరిధిలో మొత్తం 135 సర్వీసులను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో కొత్తగూడెం డిపో నుంచి 20, సత్తుపల్లి డిపో నుంచి 8, మణుగూరు డిపో నుంచి 29, మధిర డిపో నుంచి 12, భద్రాచలం డిపో నుంచి 45 బస్సులతో పాటు ఖమ్మం డిపో ద్వారా నడిచే 21 సర్వీసులు రద్దు చేశారు.

నేడు పలు రైళ్ల దారి మళ్లింపు

ఖమ్మం మామిళ్లగూడెం: భారీ వర్షాల కారణంగా కాజీపేట, బల్హార్షా మార్గంలోని వివిధ ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌పైకి వరద చేరింది. దీంతో ఖమ్మం మీదుగా వెళ్లే పలు రైళ్లను శుక్రవారం దారి మళ్లిస్తున్నట్లు సీసీఐ జాఫర్ తెలిపారు. దానాపూర్ – బెంగళూరు సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్(12296)ను మన్మాడ్, వాడీ, గుంతకల్లు మీదుగా నడిపిస్తారు. అలాగే, ఛాప్రా – చెన్నై గంగాకావేరి ఎక్స్‌ప్రెస్(12670) ముద్ఖేడ్, నిజామాబాద్, గుంతకల్లు మీదుగా, బరోనీ – ఎర్నాకులం రప్తీసాగర్ ఎక్స్‌ప్రెస్((12511) మన్మాడ్, వాడీ, గుంతకల్లు మీదుగా నడుస్తాయని తెలిపారు.

ఒక్కసారిగా తగ్గిన ఓపీ



వెలవెలబోతున్న పేర్ల నమోదు కౌంటర్లు

ఖమ్మం వైద్యవిభాగం: ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య తగ్గింది. సీజనల్ వ్యాధుల ప్రభావం ఇప్పుడిప్పుడే మొదలవుతున్నా వర్షాల కారణంగా ఆస్పత్రికి వచ్చేవారు మాత్రం తగ్గిపోయారు. చాలా మంది దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లటమో, లేదంటే ఇంట్లోనే మందులు వాడుతుండడమో చేస్తున్నారు. ఫలితంగా ఆస్పత్రి ఓపీ విభాగం వెలవెలబోతోంది.

న్యాయసేవాధికార సంస్థపై నమ్మకాన్ని పెంచండి

ఖమ్మంలీగల్: ఉచిత న్యాయసాయం అందించేందుకు నియమితులైన డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, మధ్యవర్తిత్వ కేంద్ర న్యాయవాదులు తమ విధులు సమర్థవంతగా నిర్వర్తిస్తూ న్యాయసేవాధికార సంస్థపై నమ్మకాన్ని పెంచాలని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా సూచించారు. ఖమ్మంలో గురువారం ఆయన న్యాయవాదులతో సమావేశమై మాట్లాడారు. మధ్యవర్తిత్వ కేంద్రానికి కోర్టు నుంచి వివాదం వచ్చినట్లయితే గరిష్టంగా 90రోజుల్లో తిరిగి పంపించాలని తెలిపారు. అలాగే, ముద్దాయిలతో ప్రత్యక్షంగా మాట్లాడి సమర్థవంతంగా వాదనలు వినిపించాలన్నారు. న్యాయవాదులు ఎం.హన్మంతరావు, ఎం.వలరాజు, టి.శ్రీను, ఎస్.శ్రీనివాస్‌శర్మ, ఎస్.రమాదేవి, సుబ్రహ్మణ్యం, పి.వెంకటేశ్వర్లు, రవీంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

మోతీనగర్‌లో మున్నేరు వరదతో మునిగిన ఇళ్లు





మోతీనగర్ నుంచి ముంపు బాధితులను తెప్పలపై తీసుకొస్తున్న దృశ్యం

మున్నేరు వరద ఉధృతితో మునిగిపోయిన ప్రకాశ్‌నగర్ వైకుంఠధామం



మున్నేరు.. ముంచెత్తింది !

ఖమ్మం పరీవాహకాన్ని కమ్మేసిన మున్నేరు

- 18 ఏళ్ల తర్వాత 30 అడుగులు దాటిన నీటిమట్టం
- 3వేల మందికి పైగా పునరావాస కేంద్రాలకు తరలింపు
- వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించిన ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు
- సహాయక చర్యల్లో పాల్గొన్న మంత్రి పువ్వాడ, కలెక్టర్, అధికారులు
- వరద ఉధృతిపై పువ్వాడతో ఆరా తీసిన సీఎం కేసీఆర్

మున్నేరులో నీటి మట్టం ఇలా (అడుగుల్లో)

సమయం	నీటిమట్టం
ఉదయం 6 గంటలకు	25
మధ్యాహ్నం ఒంటి గంటకు	29
3గంటలకు	30
సాయంత్రం 4గంటలకు	30.50
సాయంత్రం 5 గంటలకు	30.70
సాయంత్రం 6 గంటలకు	30.50
రాత్రి 10గంటలకు	30

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి వరంగల్, జిల్లాలో ఎడతెగని వర్షాలతో వరద జిల్లాను ముంచెత్తుతోంది. ఎగువ నుంచి భారీగా రావడంతో మున్నేరు ఉగ్రరూపం దాల్చింది. గత 18 ఏళ్లలో లేని విధంగా వరద రావడంతో మున్నేరు పరీవాహక ప్రాంతంలోని కాలనీలన్నీ మునిగాయి. రాత్రికి రాత్రే దాదాపు 10 అడుగల మేర నీటిమట్టం పెరగగా.. ముంపు ప్రాంతాల ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. కాగా, మున్నేటి వరదను గురువారం రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పరిశీలించి అధికారులకు సూచనలు చేయడంతో పాటు సహాయక చర్యలను పర్యవేక్షించారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, జల వనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్, అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్త, ఎమ్మెల్సీ తాత మధు, ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్‌రెడ్డి, రాములు నాయక్ తదితరులు జిల్లాలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. కాగా, వరద కారణంగా జిల్లాలోని పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

నిండా నీళ్లు

కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్ పూర్తిగా నిండింది. ఆకేరు వరద ఉధృతితో తిరుమలాయపాలెం మండలంలోని పలు తండాల్లోకి వరద నీరు చేరి మిర్చి, వరినార్లు కొట్టుకుపోయాయి. వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండి 21 అడుగులకు చేరడంతో వైరాలోని ఇందిరమ్మ కాలనీ, రాజీవ్ కాలనీ, మండలంలోని లక్ష్మీపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. అలాగే, సాగు అవసరాల కోసం కుడి, ఎడమ కాల్వలకు నీరు విడుదల చేశారు. పెనుబల్లి మండల పరిధిలోని లంకాసాగర్ ప్రాజెక్టు 16 అడుగులు పూర్తిస్థాయిలో నిండి అలుగు పడింది. చింతకాని మండలం మత్కేపల్లి వద్ద మున్నేరు ఉధృతంగా ప్రవహించడంతో ప్రజలు వెళ్లకుండా చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు.



బాధితుల తరలింపును పర్యవేక్షిస్తున్న సీపీ వారియర్

మంత్రికి ఫోన్ చేసిన సీఎం కేసీఆర్

మున్నేటి వరద రాత్రికి రాత్రే 10 అడుగుల మేర పెరగడంతో పలు కాలనీలు జలమయమయ్యాయి. ఆయా ప్రాంతాల్లోని ప్రజలను స్థానిక గజ ఈతగాళ్లు బయటకు తీసుకురాగా.. వరదలో చిక్కుకుపోయిన మరికొందరిని ఎన్‌డీఆర్ఎఫ్(నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలు రక్షించాయి. ముఖ్యమంత్రి కేసీఆర్.. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు ఫోన్ చేసి మున్నేటి వరద ఉధృతి, సహాయక చర్యలపై ఆరా తీశారు. పునరావాస కేంద్రాల్లో కూడా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా మంత్రి పువ్వాడ డ్రోన్ కెమెరాలు తెప్పించి వరద ఉధృతిని పర్యవేక్షిస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు.

రాత్రికి రాత్రే పెరిగిన వరద

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో ఖమ్మం జిల్లాలోని వాగులు, వంకలకు వరద పోటెత్తింది. మున్నేరు, ఆకేరు వరద ఉధృతితో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. బుధవారం రాత్రి 10 గంటలకు మున్నేరు వరద ఉధృతి 15.50 అడుగులుగా ఉండగా, గురువారం ఉదయం 6గంటలకల్లా 25 అడుగులకు చేరింది. ఆ తర్వాత సాయంత్రం 6 గంటల వరకు 30.50 అడుగులకు చేరడంతో ఖమ్మంలోని మున్నేటి పరీవాహక ప్రాంతం, ఖమ్మంరూరల్ మండలంలోని పలు కాలనీలు నీట మునిగాయి. ఆర్టీసీ కాలనీ, పద్మావతి నగర్, మోతీనగర్ కాలనీల్లో ఇళ్లపై ఉన్న పలువురిని ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ చేసి పునరావాస కేంద్రాలకు తరలించాయి. సాయంత్రం 5 గంటలకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ఖమ్మం చేరుకుని వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించాయి. మొత్తంగా ఖమ్మం కార్పొరేషన్, ఖమ్మంరూరల్ మండలాల్లోని 20కి పైగా కాలనీలు, గ్రామాలు జలమయం కాగా, సుమారు 3 వేల మందికి పైగా ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. బఫర్‌జోన్‌లో నిర్మించిన ఇళ్లు నీటమునగగా, కాల్వొడ్డు, ప్రకాష్‌నగర్‌లో నిర్మించిన శ్మశాన వాటిక, దహనవాటికల్లోకి వరద నీరు చేరింది. వరద ఉధృతి గంటగంటకు పెరగడంతో కాల్వొడ్డు పాత బ్రిడ్జి, ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై పూర్తిగా రాకపోకలను నిలిపేసి రాపర్తినగర్ కొత్త బ్రిడ్జి పైనుంచే రాకపోకలు సాగించారు. దీంతో గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది.

రాత్రంతా పని చేస్తాం...

- ఒక్క ప్రాణం పోకుండా కాపాడడమే లక్ష్యం
- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



జిల్లా కేంద్రంలో మున్నేరు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మంత్రి పువ్వాడ, కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, మేయర్ నీరజ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు ముంపులో చిక్కుకున్న వారిని రక్షించేందుకు రాత్రంతా పని చేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. పద్మావతి నగర్ వద్ద గురువారం రాత్రి ఆయన మాట్లాడుతూ వరద పెరగడంతో ఇళ్లలోనే ఉండిపోయిన వారిని మామూలు పడవలతో బయటకు తీసుకరావడం సాధ్యం కాలేదన్నారు. దీంతో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని పంపించారని తెలిపారు. దీంతో బాధితులను రక్షించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అంతకుముందు మున్నే టి వరదతో ముంపునకు గురైన కాల్వొడ్డు, పద్మావతి నగర్, బొక్కలగడ్డ, మంచికంటినగర్ ప్రాంతాల్లో మంత్రి పువ్వాడ పర్యటించారు. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని బాధితులకు భరోసా కల్పించారు.

భారీగానే ఆస్తినష్టం

మున్నేరు వరద ఉధృతితో ఖమ్మం నగరం, ఖమ్మంరూరల్ మండలాల్లోని పరీవాహక ప్రాంతాల్లో భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. వరద ఉధృతితో విద్యుత్ స్తంభాలు పలుచోట్ల ఏటిలో పడిపోయాయి. అలాగే ఇళ్లల్లోకి నీరు చేరడంతో గృహోపకరణాలే కాక వాహనాలు, ఇతర వస్తువులు తడవడంతో పాటు కొన్ని చోట్ల కొట్టుకుపోయాయి. కాగా, ముంపునకు గురైన కాలనీల నుంచి మూడు వేల మందిని ఎనిమిది పునరావాస కేంద్రాలకు తరలించారు. నలభై మంది గజ ఈతగాళ్లు బోట్ల సాయంతో సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు.

పాలేరుకు వరద పోటు



పాలేరు రిజర్వాయర్ అలుగుల ద్వారా దిగువకు వెళ్తున్న వరద

ఇన్‌ఫ్లో 85వేల క్యూసెక్కులు

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌కు వరద పోటెత్తుతోంది. పాలేరు పరీవాహక ప్రాంతంతో పాటు ఎగువన ఉన్న జిల్లాల్లో వాగులు పొంగి పాలేరుకు వరద వస్తోంది. గురువారం ఉదయం 56,320 క్యూసెక్కుల వరద రాగా.. సాయంత్రం 4గంటలకల్లా 85,466క్యూసెక్కులకు పెరిగింది. దీంతో రిజర్వాయర్ 23 అడుగుల గరిష్టస్థాయిని దాటి 27 అడుగులకు చేరింది. నాయకన్‌గూడెం వద్ద నీరు రహదారిపై మూడు అడుగుల మేర చేరడంతో ఎస్ఈ నర్సింహారావు, ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఈ రత్నకుమారి పర్యవేక్షించారు.

హై టెన్షన్ !

- 18 ఏళ్ల తర్వాత ముంచిన మున్నేరు
- భారీ వర్షసూచనతో ఆందోళన

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేటి వరద పోటెత్తగా.. గురువారం సాయంత్రం తగ్గినా ఖమ్మం నగరం, ఖమ్మంరూరల్ మండల పరీవాహక ప్రాంతాల వాసుల్లో ఆందోళన తొలగిపోలేదు. ఏటికి ఇరువైపులా 20 కాలనీలకు పైగా జలమయమయ్యాయి. 2005 సెప్టెంబర్‌లో మున్నేటి వరద పోటెత్తి ఖమ్మం పరీవాహక ప్రాంతాన్ని ముంచింది. మళ్లీ 18 ఏళ్లకు ఇంత వరద వచ్చిందని స్థానికులు వెల్లడించారు. బుధవారం ఉదయం 9నుంచి గురువారం ఉదయం 9 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా సగటున 10 సెం.మీ. వర్షపాతం నమోదైంది. అయితే అత్యధికంగా కారేపల్లి మండలంలో 18.6 సెం.మీ., కామేపల్లిలో 20.4, రఘునాథపాలెంలో 12.8, ఖమ్మంఅర్బన్‌లో 12.8, తిరుమలాయపాలెంలో 14.6, కూసుమంచిలో 10.1 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా.. ఈ వరద చాలావరకు మున్నేటిలో కలిసింది. దీనికి తోడు ఉమ్మడి వరంగల్ నుంచి వరద రావడంతో మున్నేరు ఉధృతరూపం దాల్చినట్లు భావిస్తున్నారు. అయితే, జిల్లావ్యాప్తంగా మరో రెండు రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయనే సూచనలతో ప్రజల్లో ఆందోళన నెలకొనగా.. అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు.

సహాయక చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్

పలు కుటుంబాలను రక్షించిన సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పలు కాలనీలను మున్నేరు వరద ముంచెత్తగా ఉదయం 6 గంటల నుంచే సహాయక చర్యలు ముమ్మరం చేశారు. రామన్నపేట, వెంకటేశ్వర నగర్, పద్మావతినగర్, గణేష్‌నగర్, జూబ్లీపుర, బొక్కలగడ్డ, మంచికంటినగర్, కాల్వొడ్డు, మోతినగర్, రంగనాయకుల గుట్ట, పంపింగ్‌వెల్ రోడ్డు పెద్దమ్మతల్లి గుడి వెనుక ప్రాంతం, ప్రకాశ్ నగర్, ధంసలాపురం కొత్తకాలనీ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధమయ్యారు. కొన్నిచోట్ల ఆకస్మాత్తుగా వరద పెరగడంతో స్టీమర్లు, తెప్పల ద్వారా ఒడ్డుకు చేర్చారు. అయినా పద్మావతి నగర్‌లో ఏడుగురు కుటుంబ సభ్యులు, వెంకటేశ్వరనగర్‌లో 20 మంది వరకు ఇళ్లపైనే ఉండగా, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సీఎం కేసీఆర్‌కు విషయాన్ని వివరించారు. దీంతో వైజాగ్ నుండి కొత్తగూడెం వెళ్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని ఖమ్మం రప్పించారు. ఈమేరకు 30 మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది మోతీనగర్‌లో మునగాటి లక్ష్మీనారాయణ, లక్ష్మీదేవి, యశ్వంత్, అరవింద్, కావ్య, ప్రవలికతో పాటు ఐదు నెలల చిన్నారి యశ్వంత్‌ను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. రెస్క్యూను మంత్రి పువ్వాడ పర్యవేక్షించగా కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, మేయర్ పి.నీరజ, మాజీ కార్పొరేటర్ టి.రామారావు పాల్గొన్నారు.



వరద నుంచి బయటపడిన స్థానికులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో మంత్రి అజయ్

ఖమ్మం పెద్దాస్పత్రిలో ఆ‘పరేషాన్’

- వర్షానికి కురుస్తున్న థియేటర్
- రోగులకు ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం

ఖమ్మం వైద్యవిభాగం: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఖమ్మంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పలు చోట్ల కురుస్తోంది. కార్యాలయంతో పాటు ఆస్పత్రిలోని పలుచోట్ల పైకప్పు నుండి వర్షపు నీరు కారి వార్డుల్లో రోగులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇదే సమయాన ఆపరేషన్ థియేటర్‌కు కూడా ముప్పు ఏర్పడింది. అత్యంత శుభ్రత మధ్య శస్త్రచికిత్సలు నిర్వహించాల్సిన థియేటర్‌లో వర్షపు నీరు చేరడంతో ప్రమాదకరంగా మారింది. ఈ థియేటర్‌లో సాధారణ శస్త్రచికిత్సలతో పాటు ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ రోగులకు కూడా ఆపరేషన్లు చేస్తారు. నిత్యం పదుల సంఖ్యలో శస్త్రచికిత్సలు చేసే థియేటర్‌ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ.... బయటి వారెవ్వరినీ అనుమతించరు. కానీ థియేటర్‌లో చాలా చోట్ల కురుస్తుండటంతో వర్షపు నీరు చేరి రోగులకు ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశముందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనరల్ ఆస్పత్రి భవనం మూడు దశాబ్దాల క్రితం నిర్మించినది కావడంతో పలుచోట్ల కురుస్తోందని సమాచారం.



పైకప్పు కురుస్తున్న థియేటర్‌లో శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు



ఆపరేషన్ థియేటర్ ఫ్లోర్‌పై నీటితో జారకుండా వేసిన బస్తాలు

క్లుప్తంగా

వరద సహాయక చర్యలపై ఎంపీ ఆరా

ఖమ్మం మయూరిసెంటర్: జిల్లాకేంద్రంలోని మున్నేరుకు భారీగా వరద రావడంతో జలమయమైన ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగంగా చేపట్టాలని ఎంపీ నామా నాగే శ్వరరావు సూచించారు. ఈమేరకు ఆయన గురువారం కలెక్టర్ గౌతమ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వరద ముంపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పునరావాస కేంద్రాలకు తరలించాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పేర్కొన్నారు.

సీటీసీ ఏసీపీగా ఫణీదర్

ఖమ్మంక్రైం: సిటీ పోలీస్ ట్రెనింగ్ సెంటర్(సీటీసీ) ఏసీపీగా ఫణీధర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల చేపట్టిన బదిలీల్లో భాగంగా ఐజీ కార్యాలయంలో వెయిటింగ్ జాబితాలో ఉన్న ఆయనను ఖమ్మం సీటీసీకి కేటాయించగా విధుల్లో చేరారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఖమ్మం సహకారనగర్: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో గురువారం జేఏసీ ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచడంతో పాటు పర్మినెంట్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. వివిధ పార్టీలు, సంఘాల నాయకులు బాగం హేమంతరావు, సింగు నర్సింహారావు, రామయ్య, రామాజంనేయులు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, ఏ.అశోక్, సీతా మహాలక్ష్మి, మంద వెంకటేశ్వర్లు, చెన్నారావు, జాల రామయ్య, మహేష్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కారు బోల్తా..

సత్తుపల్లి: అదుపుతప్పి కారు బోల్తాపడిన ఘటన సత్తుపల్లిలో గురువారం చోటుచేసుకుంది. దమ్మపేట మండలం మొద్దులగూడేనికి చెందిన కె.గాంధీ కారులో ఖమ్మం వెళ్తుండగా సత్తుపల్లి శివారు సింగరేణి బైపాస్ రోడ్డు వద్ద అదుపు తప్పింది. దీంతో కారు కాల్వలోకి దూసుకెళ్లి బోల్తా పడగా ఎవరికి గాయాలు కాకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు.

రూ.1.30 కోట్లు స్వాహా..

చేగుంట(తూప్రాన్): ఆరోగ్యం బాగు చేస్తానని బాబా చెప్పిన మాటలు నమ్మి డబ్బు పోగొట్టుకున్నామని ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెంకు చెందిన షేక్ ఖాసీం కుటుంబ సభ్యులు గురువారం చేగుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చేగుంట మండలం మక్కరాజీపేటకు చెందిన బగల్ దర్గా వ్యవస్థాపకుడు నయ్యర్ ఘోరీ ఆరోగ్యం బాగు చేస్తానని తమ గ్రామానికి రాగా, ఇంట్లో గుప్తనిధులు ఉన్నాయని నమ్మించాడని తెలిపారు. పొలం అమ్మితే అంతా బాగు చేస్తానని చెప్పగా ఐదెకరాలు అమ్మేయగా, వచ్చిన రూ.1.30కోట్లు బాబా తీసుకుని, తమ కుమారుడికి ఉద్యోగం, ఇల్లు ఇప్పిస్తానని చెప్పి తప్పించుకుంటున్నాడని వాపోయారు. ఈవిషయమై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.

గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వే స్టేషన్‌లో ముప్పై కేజీల గంజాయిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని థానే జిల్లాకు చెందిన కిషోర్ ముంబై వెళ్లేందుకు గంజాయితో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. ఖమ్మంలో తనిఖీ చేపట్టగా రూ.6లక్షల విలువైన గంజాయి లభించింది. జీఆర్పీ ఎస్ఐ భాస్కర్‌రావు, ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్‌లో నీళ్లు.. బంక్ సీజ్

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని ఐఓసీ బంక్‌లో పెట్రోల్ కల్తీ జరుగుతోందనే ఆరోపణలు అధికారులు తనిఖీ చేపట్టి సీజ్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీచక్ర ఏజెన్సీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఐఓసీ బంక్‌లో కొందరు వినియోగదారులు సీసాలో పెట్రోల్ తీసుకోగా నీళ్లు కనిపించాయి. దీంతో వారు సివిల్ సప్లయీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఖమ్మం అర్బన్, మధిర సివిల్ సప్లయీస్ డీటీలు అహ్మద్, రామచంద్రరావు, తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యాన గురువారం తనిఖీ చేశారు. పెట్రోల్ నిల్వ చేసిన అండర్‌గ్రౌండ్ ట్యాంక్‌లో వర్షపు నీరు చేరినట్లు గుర్తించి శ్యాంపిల్స్ సేకరించాక బంక్‌ను సీజ్ చేశారు. కాగా, కేవలం వర్షపు నీరు ట్యాంకుల్లోకి వెళ్లడమే కారణంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఉద్యోగులు కిరణ్‌కుమార్, మధుసూదన్‌రావు, అశోక్ పాల్గొన్నారు.

బావిలో పడి రైతు మృతి

నేలకొండపల్లి: వరి నాట్లు వేసేందుకు పొలానికి నీరు పట్టాలని వెళ్లిన ఓ రైతు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. మండలంలోని ఆచార్లగూడెంకు గ్రామానికి చెందిన రైతు మార్తి కృష్ణయ్య(50) గురువారం తెల్లవారుజామునే నీరు పట్టేందుకు వెళ్లాడు. అయితే, బావి వద్ద ప్రమాదవశాత్తు కాలు జారి పడడంతో ఆయనకు ఈత రాకపోగా మృతి చెందాడు. చాలాసేపటి వరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిశీలించగా బావి వద్ద కాళ్లు జారిన ఆనవాళ్లు కనిపించాయి. దీంతో బావిలో నీరు తోడించినా తగ్గకపోగా, గజ ఈతగాళ్లను దింపడంతో మృతదేహం బయటపడింది. కృష్ణయ్యకు భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి..

మధిర: మధిర–మోటమర్రి స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి(45) గురువారం రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. జీఆర్పీ ఎస్సై భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం.. సదరు వ్యక్తి రైలులో ప్రయాణిస్తున్న క్రమాన ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో అన్నం ఫౌండేషన్ సభ్యుల సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

కన్నీరు... మున్నేరు

జిల్లా కేంద్రంలో మున్నేరు వరద ముంచెత్తడంతో పలు కాలనీలు నీటమునిగాయి. ఆకస్మాత్తుగా వచ్చిన వరదతో విలువైన సామగ్రి కూడా తీసుకురాలేక అధికారుల సూచనలతో ప్రజలు కట్టుబట్టలతో పునరావాస కేంద్రాలకు వచ్చారు. ఇక జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో కూడా వరద పోటెత్తడంతో పలుచోట్ల రహదారులు జలమయమయ్యాయి. – సాక్షి నెట్‌వర్క్


నయాబజార్ పాఠశాల పునరావాస కేంద్రంలో వరద బాధితులకు భోజనం వడ్డిస్తున్న మంత్రి అజయ్‌కుమార్


వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి


నీటమునిగిన కేబీఆర్ నగర్


తిరుమలాయపాలెం ఆకేరు వరదను పరిశీలిస్తున్న జలవనరులశాఖ సీఈ శంకర్‌నాయక్, అధికారులు


తల్లాడ మండలం బిల్లుపాడు వాగు వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ మధుసూదన్


అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్



ఖమ్మం రూరల్ ఎంపీడీఓ కార్యాలయాన్ని ముంచెత్తిన వరద


ఖమ్మంలో మున్నేరు వద్ద సెల్ఫీ దిగుతున్న ఓ కుటుంబం


ఖమ్మంలోని పద్మావతి నగర్‌లో వరదల్లో చిక్కుకున్న కారు


ఖమ్మం పద్మావతి నగర్‌లో వృద్ధురాలిని వరదల్లో నుంచి తీసుకొస్తున్న యువకులు


సహాయక చర్యల కోసం తీసుకొస్తున్న టూరిజం బోట్


ప్రకాష్‌నగర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న ఏసీపీ గణేష్, సిబ్బంది


మోతీనగర్ బాధితులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకట్రావు


వరద నీటిలోకి వెళ్లొద్దని సూచిస్తున్న కార్పొరేటర్ సరిత


ప్రకాష్‌నగర్ వంతెన పైనుంచి రాకపోకలను నిలిపివేసిన పోలీసులు


మున్నేరు వరదలో ప్రమాదంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్


నయాబజార్‌లో వరద బాధితుల పేర్లు నమోదు చేస్తున్న అధికారులు


సామగ్రి సహా గుడిసెలు వరదలో కొట్టుకుపోవడంతో మోతీనగర్ ఒడ్డున విలపిస్తున్న బాధితులు

రాకపోకలకు బ్రేక్


కరుణగిరి వద్ద నిలిచిపోయిన వాహనాలు

ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మం రూరల్: మున్నేరులో వరద పెరగడంతో గురువారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఖమ్మం ప్రకాష్‌నగర్ వంతెనపై రాకపోకలను నిలిపివేశారు. బుధవారం రాత్రే కాల్వొడ్డు వంతెనపై రాకపోకలను నిలిపేయగా, దీంతో ప్రకాష్‌నగర్, కరుణగిరి ప్రాంతాల్లో వంతెనలపై వాహనాలు వచ్చి వెళ్లాయి. ఇంతలోనే గురువారం ఉదయం ప్రకాష్‌నగర్ వంతెన పైభాగాన్ని వరద తాకుతుండడంతో ఇక్కడ రాకపోకలు ఆపేశారు. దీంతో హైదరాబాద్, కోదాడ, వరంగల్ వైపునకు వెళ్లే వారు కరుణగిరి వంతెన వద్దకు రావడంతో రద్దీ పెరిగింది. ఈసందర్భంగా నాయుడుపేట సర్కిల్ నుంచి ఖమ్మం రైల్వే బ్రిడ్జి వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఏసీపీలు రామోజీ రమేష్, బస్వారెడ్డి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

తిరునాళ్లను తలపించేలా

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంగాంధీచౌక్: మున్నేటికి వరద పోటెత్తడంతో చూసేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. ప్రకాష్ నగర్, కాల్వొడ్డు, కరుణగిరి, నాయుడుపేట, ఎఫ్‌సీఐ గోడౌన్ ప్రాంతాలకు ఖమ్మం, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు వచ్చి మున్నేటిని చూస్తూ సెల్ఫీలు దిగారు. వరదలో వాహనాలు, గ్యాస్ సిలిండర్లు, బియ్యం బస్తాలు కొట్టుకొస్తుండడంతో ఎగువన భారీ వర్షం కురిసిందా అని చర్చించుకున్నారు. దాదాపు 18 ఏళ్ల తర్వాత ఈ స్థాయిలో వరద వచ్చిందని చెప్పుకోవడం వినిపించింది.

భారీ బందోబస్తు

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని మున్నేరును వరద ముంచెత్తడంతో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ఈమేరకు మున్నేరు ఒడ్డున ముంపు ప్రాంతాల్లో 400మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి, కాల్వొడ్డులోని మున్నేరుబ్రిడ్జి, ప్రకాష్ నగర్ బ్రిడ్జిలపై రాకపోకలను నిషేధించారు. బైపాస్‌రోడ్డులోని మున్నేరు బ్రిడ్జి పైనుంచి మాత్రమే రాకపోకలను అనుమతించగా ట్రాఫిక్ స్తంభించగా పోలీసులు క్రమబద్ధీకరించారు. కాగా, ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ గౌతమ్‌తో కలిసి సీపీ విష్ణు ఎస్.వారియర్ ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లేలా సూచనలు చేశారు. మోకలి లోతు నీటిలోనే కలెక్టర్, సీపీ, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా తదితరులు పర్యటించారు. అయితే, పలువురు ముంపు బాధితులు బయటకు వచ్చేందుకు అంగీకరించకపోవడంతో మరింత వరద పెరిగే అవకాశముందంటూ అవగాహన కల్పించి పడవల ద్వారా తరలించారు.


ముంపు ప్రాంతాల ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్

15 అడుగుల కొండచిలువ

ఖమ్మంక్రైం: ఉధృతంగా ప్రవహిస్తున్న ఖమ్మంలోని మున్నేరులో 15అడుగుల భారీ కొండచిలువ కనిపించింది. మున్నేరు సమీపంలోని వెంకటేశ్వరనగర్ వాసులను పునరావాస కేంద్రానికి తరలిస్తుండగా ఓ ఇంట్లోకి భారీ కొండచిలువ ప్రవేశించింది. దీంతో స్థానికులు ఆందోళనకు గురి కాగా, కొందరు దాన్ని బంధించి అటవీ శాఖ సిబ్బందికి అప్పగించారు. ఎగువ నుంచి వస్తున్న వరదలో కొండచిలువ కొట్టుకొచ్చి ఉంటుందని భావిస్తున్నారు.


కొండచిలువను పట్టుకున్న స్థానికులు

జలగం నగర్‌లో యువకుడి గల్లంతు


సతీష్ (ఫైల్)

ఖమ్మంరూరల్: మండలంలోని జలగంనగర్‌లో మున్నేటి వరద ఉధృతికి పెంద్ర సతీష్(23) గురువారం రాత్రి గల్లంతయ్యాడు. మరో వ్యక్తితో కలిసి ఇంటి నుంచి సామగ్రి తెచ్చుకునేందుకు వెళ్లగా వరద ఒక్కసారిగా పెరగడంతో సతీష్ గల్లంతయ్యాడు. మరో వ్యక్తి క్షేమంగా బయటపడ్డాడు. అలాగే, కేబీఆర్.నగర్‌లో ఏటి ఒడ్డున ఉన్న శివాలయంలో కట్టేసిన రెండు ఆవులు వరదలో కొట్టుకుపోయాయి. ఇక కేబీఆర్ నగర్‌లో రెండిళ్లపై 75మంది వరకు సాయం కోసం ఎదురు చూస్తునే ఉన్నారు. రాత్రి కావడం, వరద ఉధృతి పెరగడంతో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్‌ను నిలిపేశాయి. ఇక మేధా కళాశాల నాలుగో ఫ్లోర్‌లో చిక్కుకున్న 10మంది విద్యార్థినులను బయటకు తీసుకొచ్చే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

కేజీబీవీలోకి చేరిన వరద

కారేపల్లి: కారేపల్లిలో బుధవారం రాత్రి కుండపోతగా కురిసిన వర్షంతో మద్దులవాగు పొంగుపొర్లగా కేజీబీవీలోకి వరద చేరింది. దీంతో విద్యార్థినులు పైఅంతస్తులోని డార్మిటరీకి చేరుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఈసమాచారం అందుకున్న ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్ఐ పి.రామారావు, కేజీబీవీ స్పెషల్ ఫీసర్ ఝాన్సీసౌజన్య రాత్రంతా విద్యార్థినులకు ధైర్యం చెబుతూ పరిస్థితులను పర్యవేక్షించారు. కాగా, గురువారం ఉదయానికి వరద తగ్గుముఖం పట్టడంతో జీసీడీఓ భూలక్ష్మి చేరుకోగా, విద్యార్థులను ఇళ్లకు పంపించారు. అయితే, తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, వంటశాలలోకి వరద చేరడంతో అడుగు మందం బురద పేరుకుపోయింది.


కేజీబీవీలో పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్ఐ, స్పెషల్ ఆఫీసర్

వైరా రిజర్వాయర్‌కు పోటెత్తిన వరద

- నీట మునిగిన కాలనీలు
- సాగుకు నీరు విడుదల చేసిన ఎమ్మెల్యే

వైరా: వైరాలోని రిజర్వాయర్‌కు ఒక్కసారిగా వరద పోటెత్తింది. గురువారం ఉదయం 6 గంటలకు నీటిమట్టం 22 అడుగులకు చేరడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. స్టేజీ పినపాక హైలెవల్ బ్రిడ్జి వద్ద రిజర్వాయర్ ఐదు అలుగులు ద్వారా వస్తున్న వరద నీటితో ప్రవాహం ప్రమాదకర స్థాయికి చేరింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. పరివాహక ప్రాంతాలను ఏసీపీ రహమాన్, సీఐ నునావత్ సాగర్ పరిశీలించారు. కాగా, వైరా రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా సాగు అవసరాలకు ఎమ్మెల్యే రాములునాయక్ నీరు విడుదల చేశారు. జెడ్పీటీసీ కనకదుర్గ, మార్కెట్ చైర్మన్ బీడీకే.రత్నం, జలవనరులశాఖ ఈఈ బాబూరావు, డీఈ శ్రీనివాస్, నాయకులు బొంతు రాంబాబు, బాణాల వెంకటేశ్వర్లు, బానోత్ సక్కుబాయి పాల్గొన్నారు.

■ పెనుబల్లి : మండలంలోని లంకాసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 16 అడుగులు దాటి అలుగు పోస్తోంది. గురువారం ఉదయం రెండు అడుగుల మేర అలుగు పోస్తూ సాయంత్రానికి తగ్గింది. కల్లూరు ఏసీపీ బి.రామానుజం, సీఐలు సీహెచ్.హనూక్, టి.కరుణాకర్, ఎస్సై జి.సూరజ్, నీటి పారుదలశాఖ డీఈ రామారావు, జేఈ కిరణ్ పర్యవేక్షించారు.

■ కల్లూరు: కల్లూరు సర్కిల్ పరిధిలోని మధ్యతరహా ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి భారీగా వరద చేరిందని ఎస్‌సీ ఆనందరావు తెలిపారు. కల్లూరులో ఆయన మాట్లాడుతూ దాదాపు అన్ని చెరువుల్లోకి గరిష్టస్థాయిలో నీరు చేరిందని చెప్పారు.


వైరా రిజర్వాయర్ అలుగుల నుంచి భారీగా బయటకు పోతున్న నీరు


పెనుబల్లి : లంకాసాగర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు

దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విరిగిన స్తంభాలు

ఖమ్మంవ్యవసాయం: వరదల ప్రభావం విద్యుత్ విభాగంపై పడింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినగా, స్తంభాలు విరిగిపడ్డాయి. జిల్లాలోని మున్నేరు నదీ పరీవాహక ప్రాంతంతో పాటు పాలేరు, వైరా, ముదిగొండ తదితర ప్రాంతాల్లోని వరద ధాటికి ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు నేలకూలాయి. పలుచోట్ల వరద ట్రాన్స్‌ఫార్మర్లను ముంచెత్తింది. జిల్లా వ్యాప్తంగా గురువారం 50 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినగా, 30కి పైగా స్తంభాలు విరిగి పడ్డాయని అధికారులు గుర్తించారు. కాగా, వరద కారణంగా ప్రమాదాలు జరగకుండా మున్నేరు పరీవాహక ప్రాంతంతో పాటు జిల్లాలోని పాలేరు, వైరా, ముదిగొండ వంటి వరదలున్న ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పరిస్థితి అదుపులోకి వచ్చాక పునరుద్ధరిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఏ.సురేందర్ తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సమస్యలపై 94408 11525 నంబర్‌కు ఫోన్ చేయొచ్చని ఎస్ఈ చెప్పారు.


స్తంభాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ సురేందర్, డీఈ రామారావు తదితరులు

పంటలకూ తీరని నష్టం

విస్తారంగా కురుస్తున్న వర్షాలతో సాగులో ఉన్న పంటలు దెబ్బతింటున్నాయి. పది రోజులకు పైగా వర్షాలు కురుస్తుండడంతో గాలి, నేలలో తేమశాతం పెరిగింది. దీంతో పైర్లు తెగుళ్ల బారిన పడి ఎర్రబారాయి. పత్తి, అపరాలు, మొక్కజొన్న పంటలు సాగులో ఉండగా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వరి నాట్లు వేస్తున్నారు. అయితే, పలుచోట్ల పత్తి, అపరాల పంటలు ముంపునకు గురయ్యాయి. జిల్లా వ్యవసాయ శాఖ మాత్రం ప్రస్తుత కురుస్తున్న వర్షాలు, వరదలతో పంటలకు ఎలాంటి నష్టం జరగలేదని వెల్లడించింది. కాగా, జోరు వానలతో వరి సాగు ఊపందుకునే అవకాశముంది.

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలి

డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ భూషణ్ ప్రసాద్‌సింగ్

సత్తుపల్లి రూరల్: రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ బొగ్గు ఉత్పత్తి చేయాలని సౌత్ సెంట్రల్ జోన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ భూషణ్ ప్రసాద్‌సింగ్ సూచించారు. ఆయన సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని సత్తుపల్లి జేవీఆర్ ఓసీని గురువారం తన బృందంతో కలిసి సందర్శించారు. తొలుత కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు స్వాగతం పలకగా, ఓసీ వివరాలను అధికారులు ఎస్.వెంకటాచారి, నరసింహారావు వెల్లడించారు. అనంతరం భూషణ్‌ప్రసాద్ మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి ఎంత ముఖ్యమో కార్మికుల భద్రత అంతే ముఖ్యమని గుర్తించాలని తెలిపారు. ఆతర్వాత ఇన్‌స్పెక్టర్ ఆఫ్ మైన్స్(హెచ్ఓ) డాక్టర్ జార్జ్‌జాన్ జేవీఆర్ ఓసీ డిస్పెన్సరీని తనిఖీ చేశారు. ఈకార్యక్రమాల్లో అధికారులు ఉమేష్, ఎం.సావర్కర్, బైసారే, కమలేష్ కుమార్, దిలీప్‌కుమార్, జె.కుమారస్వామి, రవి, కోటిరెడ్డి, పి.సామ్యూల్ సుధాకర్, ఎస్.సదానందం, ఎం.వెంకటేశ్వరరావు, నర్సింహారావు, లక్ష్మణమూర్తి, మధుసూదన్, రాందాస్, జి.సుధాకర్, కె.దేవదాస్, విజయసందీప్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న భూషణ్ ప్రసాద్‌సింగ్

మృతదేహంతో రాస్తారోకో

కూసుమంచి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్‌తో గురువారం మృతదేహంతో రాస్తారోకో చేపట్టారు. డలంలోని జుజుల్‌రావుపేటకు చెందిన శ్రీరాముల ఉప్పయ్య(44) బుధవారం జాతీయ రహదారిపై తన ద్విచక్ర వాహనంపై కూసుమంచి వెళ్తుండగా, వెనక నుంచి వస్తున్న కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా, కారు సూర్యాపేట జిల్లా నర్సింహాపురానికి చెందిన ఆర్ఎంపీ పి.నాగేశ్వరరావుదిగా తేలడంతో ఉప్పయ్య కుటుంబసభ్యులు, బంధువులు సూర్యాపేట–ఖమ్మం రహదారిపై గంటకుపైగా రాస్తారో కో నిర్వహించారు. ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డిని కూడా కలిసి న్యాయం చేయాలని వేడుకున్నారు. దీంతో ఇరువర్గాలు పెద్దలు చర్చించి ఆందోళన విరమింపజేశారు. కాగా, ఫ్లైవోవర్ సర్వీస్ రోడ్డుపై ఉప్పయ్య రాంగ్ రూట్‌లో వెళ్తుండగా ఖమ్మం వెళ్తున్న కారును ఢీకొట్టడంతో ఆయన మృతి చెందాడని, కారు నడుపుతున్న ఆర్ఎంపీ నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌కుమార్ తెలిపారు.


రాస్తారోకో చేస్తున్న ఉప్పయ్య బంధువులు

కూలిన ఇళ్లు

కల్లూరు రూరల్/బోనకల్: కల్లూరులోని పుల్లయ్య బంజరు వీధిలో ఒక ఇల్లు కూలిపోయింది. గోడలు నానడంతో ఇల్లు కూలగా ఎవరికీ ప్రమాదం జరగలేదు. యజమాని రోజువారీ కూలీ చేసుకునే బధిరుడు కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అలాగే, బోనకల్ మండలం ఆళ్లపాడు, రావినూతలల్లో రెండు పాత పెంకుటిల్లులు కూలిపోయాయి. ఆ సమయానికి ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.


కల్లూరు రూరల్ : వర్షానికి కూలిపోయిన ఇల్లు